క్లుప్తంగా

యోగి వేమన జయంతిని విజయవంతం చేయండి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న రెడ్డి సంఘం నాయకులు

గోరంట్ల: స్థానిక ఎస్‌ఎల్‌ఎన్ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 19న నిర్వహించనున్న యోగి వేమన జయంతి వేడుకల్లో రెడ్డి కులస్తులంతా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని మండల రెడ్డి సంఘం నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో రెడ్డి సంఘం నాయకులు మాట్లాడారు. యోగి వేమన జయంతిని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించి జీవో విడుదల చేయడం హర్షణీయమన్నారు. అనంతరం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో గోరంట్ల మార్కెట్ యార్డు చైర్మన్ బూదిలి వేణుగోపాల్‌రెడ్డి, జిల్లా సహకార బ్యాంకు డైరెక్టర్ పాటూరి శంకరరెడ్డి, మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ పోతుల రామకృష్ణారెడ్డి, రెడ్డి సంఘం నాయకులు పాల్గొన్నారు.

21న ఉచిత గుండె వైద్య శిబిరం

రొద్దం: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఈనెల 21న ఎమ్మెల్యే శంకరనారాయణ, ఎంపీపీ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కిమ్స్ సవీరా డాక్టర్లతో ఉచిత గుండె వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీపీ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. 2డీ ఏకో, జీఆర్‌బీఎస్, ఇసీజీ, బీపీ తదితర వాటికి నిర్ధారణ పరీక్షలు నిర్వహించి అవసరమైతే శస్త్ర చికిత్సలకు రెఫర్ చేస్తారని పేర్కొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

పెనుకొండ: మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్‌ఐ రమేష్‌బాబు హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ప్రాంతాన్ని ఆయన సందర్శించారు. సోమవారం ఆర్టీసీ బస్సు ఢీకొని నారాయణప్ప అనే వృద్ధుడు మరణించగా ప్రమాద తీరును అడిగి తెలుసుకున్నారు. అనంతరం ద్విచక్ర వాహనాల రికార్డులు పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు మైనర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న పోలీసులు

గోరంట్ల: మండలంలోని కోరేవాండ్లపల్లి క్రాస్ వద్ద అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తున్న ఆంజనేయులు అనే వ్యక్తిని అరెస్ట్ చేశామని సీఐ సుబ్బరాయుడు తెలిపారు. ద్విచక్ర వాహనంతో పాటు 288 ప్యాకెట్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

రొళ్ల: మండల పరిధిలోని వన్నారనపల్లి క్రాస్ దగ్గర అక్రమంగా మద్యం తరలిస్తున్న కదిరప్ప అనే వ్యక్తిని మంగళవారం సాయంత్రం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటరమణ తెలిపారు. అతని వద్ద నుంచి 55 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

రేపు చేపల చెరువు వేలం

గుడిబండ: మండలంలోని రాళ్లపల్లి పంచాయతీలోని ముదిగుబ్బ చెరువులో చేపల పెంపకానికి గురువారం ఉదయం 11 గంటలకు గ్రామ సచివాలయంలో వేలంపాట నిర్వహించనున్నట్లు సర్పంచ్ లక్ష్మీనారాయణ, కార్యదర్శి గోవిందప్ప తెలిపారు. ఆసక్తి గల వ్యాపారస్తులు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చన్నారు.

21 నుంచి వీరకేతమ్మ బ్రహ్మోత్సవాలు



అలంకరణలో వీరకేతమ్మ

మడకశిరరూరల్: మండలంలోని కల్లుమర్రి గ్రామంలో వెలసిన వీరకేతమ్మ బ్రహ్మోత్సవాలు ఈనెల 21 నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 21న కలశ స్థాపన, జ్యోతులు, కల్యాణోత్సవం, 22న నాగదేవతా హోమం, చండీయాగం, మధ్యాహ్నం అమ్మవారి బ్రహ్మరథోత్సవాన్ని నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు.

వచ్చే ఎన్నికల్లో జగనన్నకే మా మద్దతు



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు అడివక్క. వీరిది మడకశిర మండలం ఉప్పార్లపల్లి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా రూ.82 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.22,500, పంటల బీమా కింద రూ.2,441 మొత్తం రూ, 1,06,941 లబ్ధి పొందారు. సీఎం జగన్ ఆధ్వర్యంలో తమకు అన్ని విధాలా భరోసా ఇచ్చారని అడివక్క హర్షం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో జగన్‌కే మద్దతు పలుకుతామన్నారు.



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు నాగరత్నమ్మ. వీరిది మడకశిర మండలం ఉప్పార్లపల్లి. ఈ మూడున్నరేళ్లలో వైఎస్సార్ ఆసరా ద్వారా రూ. 22,420, వైఎస్సార్ సున్నా వడ్డీ కింద రూ.4,944 , జగనన్న అమ్మఒడి ద్వారా రూ.29 వేలు, వైఎస్సార్ పింఛన్ కానుక కింద రూ.1,00,007 చొప్పున మొత్తం రూ.1,64,364 లబ్ధిపొందారు. సీఎం వైఎస్ జగనన్న మేలును ఎప్పటికీ మరువమని, మళ్లీ జగనన్నకే మా ఆశీర్వాదం ఉంటుందని నాగరత్నమ్మ కొనియాడారు.

- సంక్షేమ పథకాల అమలుపై లబ్ధిదారుల హర్షం



ఉపార్లపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే తిప్పేస్వామి

మడకశిరరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పార్టీలకు అతీతంగా ప్రతి గడపకూ సంతృప్తికర స్థాయిలో సంక్షేమ పథకాలను అందిస్తూ మంచి చేస్తున్నారు.. వచ్చే ఎన్నికల్లో మళ్లీ జగనన్నకే మద్దతు ఇస్తామంటూ లబ్ధిదారులు, మహిళలు పేర్కొన్నారు. భక్తరపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని ఉపార్లపల్లిలో మంగళవారం ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి సీఎం వైఎస్ జగన్ పరిపాలనలో చేపట్టిన అభివృద్ధి, పథకాలను వివరిస్తూ ప్రతి ఇంటికి మంజూరైన పథకాలతో కూడిన బుక్‌లెట్‌ను అందించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

111 రోజులు పూర్తి

నియోజకవర్గంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో చేస్తున్న గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి 111 రోజులు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సీఎంగా ఉంటేనే సక్రమంగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. మరోసారి సీఎం వైఎస్ జగన్‌ను ఆశీర్వదించి సీఎంగా చేసుకోవాలని కోరారు. గ్రామీణ క్రీడల అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం అందిస్తామన్నారు. త్వరలోనే ఉపార్లపల్లి క్రీడకారులకు ఉచితంగా వాలీబాల్, క్రికెట్ కిట్లను అందిస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ నళిని, ఎంపీపీ కవిత, సర్పంచ్ కరియన్న, వైస్ ఎంపీపీ మూర్తి, మండల పరిషత్ కోఆప్షన్ సభ్యులు ప్రకాష్, జిల్లా, మండల ఎస్సీ నాయకులు లక్ష్మీనారాయణ, మంజునాథ్, తిప్పన్న, నాయకులు నటరాజు, హనుమంతరాయప్ప, సుధాకర్, దొడ్డయ్య, మూర్తి, ఎంపీడీఓ సోనిబాయి, గ్రామ కార్యదర్శి సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

మట్టి తరలింపును అరికట్టండి

హిందూపురం టౌన్: పట్టణంలోని వాల్మీకి సేవా సంఘానికి సంబంధించిన శ్మశాన వాటికలో కొంత మంది మట్టిని అక్రమంగా తరలిస్తున్నారని వాల్మీకి సంఘం నాయకులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజతో పాటు టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వెంటనే మట్టి తరలింపును అరికట్టాలన్నారు.

వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి



వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు శంకరనారాయణతో చర్చిస్తున్న మధుమతిరెడ్డి

హిందూపురం: వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే శంకరనారాయణను మంగళవారం హిందూపురం వైఎస్సార్‌సీపీ నాయకురాలు చౌళూరు మధుమతిరెడ్డి కలిశారు. పెనుకొండ పార్టీ ఆఫీసులో మర్యాదపూర్వకంగా కలిసి హిందూపురంలో పార్టీ స్థితిగతులపై చర్చించారు. హిందూపురంలో వైఎస్సార్‌సీపీ గెలుపే తన తమ్ముడు, దివంగత చౌళూరు రామకృష్ణారెడ్డి ఆశయమని, అందు కోసం పనిచేసేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటామన్నారు. అందరూ ఒక్కతాటిపైకి వచ్చి పార్టీ గెలుపునకు కృషి చేస్తామన్నారు.

మాలలు అన్ని రంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న ఏపీ రాష్ట్ర మాల మహానాడు సంఘం ఐక్య వేదిక అధ్యక్షుడు రామరావు

అమరాపురం: మాల కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని ఏపీ రాష్ట్ర మాల మహానాడు సంఘం ఐక్య వేదిక అధ్యక్షుడు రామరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మాల మహానాడు సంఘం ఆధ్వర్యంలో వీరనారి, వీర వనిత ఓణికే ఓబవ్వ శత జయంతి ఉత్సవాలను మాల సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఉన్నత పాఠశాల నుంచి వెండి రథంలో చిన్నారులు ఓణికే ఓబవ్వ వేషధారణతో ఉరుములతో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో అధ్యక్షుడు రామరావు, శ్రీ సత్య సాయి జిల్లా మాల మహానాడు ఐక్య వేదిక అధ్యక్షుడు శంకర్, అగళి వెంకటస్వామి, ఎస్సీ మానిటరింగ్ కమిటీ సభ్యులు గంగులయ్య, మూర్తి, సోము సంఘం సభ్యులు మల్లికార్జున, క్రిష్ణమూర్తి తదితరులు మాట్లాడుతూ మాల సోదరులు ఐకమత్యంతో రాజకీయ, సామాజిక, ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్తు



క్రీడాకారులకు టీ షర్టులు అందిస్తున్న దృశ్యం

పావగడ: క్రీడలతో కేవలం మానసిక, శారీరక దృఢత్వమే కాకుండా క్రీడాకారులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని స్థానిక పీఎల్‌డీ బ్యాంకు అధ్యక్షుడు ఎన్ ఆర్ అశ్వర్థకుమార్ అన్నారు. వైఎన్ హొసకోటలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ఫుట్ బాల్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఫుట్‌బాల్ పోటీల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. క్రీడల్లో రాణిస్తే దేశ వ్యాప్తంగా గుర్తింపు లభిస్తుందన్నారు. స్పోర్ట్స్ కోటాలో ప్రభుత్వ ఉద్యోగాలు లభిస్తాయన్నారు. కేఆర్‌పీపీ నాయకుడు నేరళకుంటె నాగేంద్ర మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో ఆడాలన్నారు. అనంతరం క్రీడాకారులకు టీ షర్టులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ శివప్ప, శివానందగుప్త, నారాయణప్ప, రామలింగప్ప, అబ్దుల్ షకూర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జ్యోతుల ఉత్సవం



జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని కదిరేపల్లి గ్రామంలోని మారెమ్మ, గౌడుచంద్రమారెమ్మ అమ్మవార్లకు మంగళవారం గ్రామ మహిళలు భక్తి శ్రద్ధలతో జ్యోతుల ఉత్సవాలను నిర్వహించారు. అనంతరం అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

అన్నదాన సత్రానికి విరాళం

లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయానికి సమీపంలో నిర్మిస్తున్న అన్నదాన సత్రం నిర్మాణానికి దాతలు మంగళవారం రూ.50,000 విరాళాన్ని కమిటీ సభ్యులకు అందజేశారు. పరిగి మండలంలోని బసవనపల్లికి చెందిన వెంకట్‌రెడ్డి, అంజనమ్మల జ్ఞాపకార్థం వారి కుమారులు ప్రసన్నకుమార్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, లాయర్ శ్రీనివాస్ రెడ్డి విరాళం అందజేశారు.

'స్పందన' కు రెండు వినతులు

రొద్దం: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో రెండు వినతులు అందినట్లు తహసీల్దార్ అనంతచారి చెప్పారు. కోగిర , రొద్దం గ్రామాలకు చెందిన ఇద్దరు రైతులు భూ సమస్యలపై విన్నవించినట్లు పేర్కొన్నారు.

22న రొద్దం నుంచి పాదయాత్ర

రొద్దం: మండల కేంద్రంలోని పెద్దాంజనేయ స్వామి దేవాలయం నుంచి పావగడ శనేశ్వర దేవాలయం వవరకు శ్రీరామ భక్త మండలి ఆధ్వర్యంలో పాదయాత్ర నిర్వహించనున్నట్లు అర్చకుడు గిరీష్‌స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. కాలినడకవెళ్లి శనేశ్వరస్వామిని దర్శించుకుంటే అంతా మంచి జరుగుతుందన్నారు. మండల వ్యాప్తంగా భక్తులు తరలిరావాలని కోరారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



తిమ్మప్ప(ఫైల్)

అమరాపురం: మండల పరిధిలోని పి.శివరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు తిమ్మప్ప (52) సోమవారం తెల్లవారుజామున అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆనిమేటర్లు పి.శివరం వెళ్లి తిమ్మప్ప భౌతికకాయంపై పూలమాలలు ఉంచి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోండి

అమరాపురం: మండల పరిధిలోని హేమావతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని ప్రజలు తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ జయకుమార్ పేర్కొన్నారు. మంగళవారం హేమావతి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ప్రజలు డ్రైడే పాటించాలన్నారు. అదే విధంగా జాతీయ కీటక జనిత వ్యాధుల నివారణ కార్యక్రమం కింద అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు మడకశిర మలేరియా సబ్‌యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ ఉమాపతి, సిబ్బంది ఉన్నారు

వేమన విగ్రహావిష్కరణకు తరలిరండి

హిందూపురం టౌన్: పట్టణంలోని ఎస్.సడ్లపల్లిలో ఈ నెల 22న జరిగే వేమన విగ్రహావిష్కరణకు పెద్ద ఎత్తున తరలిరావాలని రెడ్డి జేఏసీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ముద్దిరెడ్డిపల్లి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో జిల్లా రెడ్డి జేఏసీ క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘం నాయకులు శివారెడ్డి, సోమశేఖర్‌రెడ్డి, నాగభూషణరెడ్డి, నారాయణరెడ్డి, ప్రకాష్‌రెడ్డి, హనుమంతరెడ్డి, నరిసింహారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



ఎమ్మెల్యే తిప్పేస్వామి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ కార్యకర్తలు

మడకశిర: మండలంలోని హెచ్‌ఆర్ పాళ్యం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఓబులేసు మంగళవారం తన అనుచరులతో కలసి ఎమ్మెల్యే తిప్పేస్వామి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపడుతున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై టీడీపీకి రాజీనామా చేసి వైఎస్సార్‌సీపీలో చేరినట్లు వారు పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కవిత, వైఎస్సార్‌సీపీ నాయకుడు సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రీసర్వే పనుల పరిశీలన

సోమందేపల్లి: మండలంలోని కొత్తపల్లి గ్రామంలో జరుగుతున్న రీసర్వే పనులను డీఎల్పీ బాలాజీ మంగళవారం పరిశీలించారు. ఇంటి స్థలాలు, పంచాయతీ రోడ్లు పక్కగా రీ సర్వేలో నమోదు చేయాలని సూచించారు. వీఆర్వో, సచివాలయం కార్యదర్శులు సమన్వయంతో పనిచేయాలన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ నాగరాజు రావు తదితరులు పాల్గొన్నారు.

వీధి దీపాలకు కరెంట్ కట్

మడకశిర: మడకశిర మున్సిపాలిటీ పరిధిలోని వీధి దీపాలకు మంగళవారం నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేసినట్లు ఆ శాఖ జేఈఓ కృష్ణమూర్తి తెలిపారు. వీధి దీపాలకు సంబంధించిన విద్యుత్ బకాయిలను మున్సిపాలిటీ అధికారులు చెల్లించకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. విద్యుత్ బకాయిలు రూ.60.59 లక్షలు ఉందని నోటీసులు ఇచ్చినా అధికారులు స్పందించలేదన్నారు.

శంకరనారాయణ సేవలు అభినందనీయం

రొళ్ల: మండల పరిధిలోని ఎం.రాయాపురంలో బీపీఎంగా విధులు నిర్వహిస్తూ ఇటీవల పదవీ విరమణ పొందిన శంకరనారాయణ దంపతులను సోమవారం ఘనంగా సన్మానించారు. గ్రామంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అనంతరాజు, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు గురుమూర్తి తదితరులు శంకరనారాయణ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో సర్పంచ్ నరసింహప్ప తదితరులు పాల్గొన్నారు.

శివస్వాములకు అన్నదానం

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని శివస్వాములకు స్థానిక సర్పంచ్ గంగాదేవితో పాటు ఆమె భర్త నరసింహామూర్తి ఆధ్వర్యంలో మంగళవారం అన్నదానం చేశారు.

కంటి వైద్యశిబిరానికి స్పందన



కంటి వైద్య శిబిరానికి తరలివచ్చిన వృద్ధులు

పెనుకొండ: పట్టణంలోని నామా రామయ్య కళ్యాణ మండపంలో మంగళవారం ఏకేసీఎఫ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం జరిగింది. గ్రామీణ ప్రాంతాల నుంచి హాజరైన 126 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం 70 మందిని శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. బెంగళూరుకు చెందిన శంకర్ కంటి ఆస్పత్రిలో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తామన్నారు.

నేడు వాహనాల వేలం

మడకశిర: మడకశిర పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ కేసుల్లో పట్టుబడిన వివిధ వాహనాలను బుధవారం ఉదయం 10 గంటలకు పోలీస్‌స్టేషన్ ఆవరణంలో వేలం వేయనున్నట్లు స్థానిక ఎస్‌ఐ నాగేంద్ర తెలిపారు. వేలంపాటలో పాల్గొనే వారు ఉదయం 9 గంటలకే ఆధార్, పాన్‌కార్డులతో పోలీస్‌స్టేషన్ వద్దకు చేరుకోవాలన్నారు. నిర్ణయించిన ధరలో 10 శాతం డిపాజిట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

గోరంట్ల: మండలంలోని వెంకటరమణపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని వెంకటరమణపల్లి, నల్లన్నపల్లి, శెట్టిచిన్నంపల్లి, పెరమాళ్లపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ ఆధ్వర్యంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథగుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. వెంకటరమణపల్లిలో ఉదయం 8 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

చిలమత్తూరు: మండలంలోని చాగలేరు పంచాయతీ శానిగానిపల్లిలో ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ ఆధ్వర్యంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

హారేసముద్రంలో...

మడకశిరరూరల్: మండల పరిధిలోని హారేసముద్రం గ్రామ సచివాలయం పరిధిలోని గొల్లపల్లి, దొడ్డేపల్లి గ్రామాల్లో బుధవారం ఉదయం 9 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ కవిత తెలిపారు. ఎమ్మెల్యే తిప్పేస్వామి ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు.

'అనంత ఆణిముత్యాలు'ను విజయవంతం చేయండి



కలెక్టర్‌ను ఆహ్వానిస్తున్న ప్రతాపరెడ్డి

పెనుకొండ: పట్టణంలో ఈనెల 28న జరిగే 8వ అనంత ఆణిముత్యాల పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సాహితీ గగన్‌మహల్ ట్రస్ట్ అధ్యక్షుడు ప్రతాపరెడ్డి అనంతపురం జిల్లా కలెక్టర్ నాగలక్ష్మిని కోరారు. మంగళవారం అనంతపురంలోని కలెక్టర్ కార్యాలయంలో ఆమెను కలసిన ప్రతాపరెడ్డి పురస్కార ప్రదాన కార్యక్రమంలో పాల్గొనాలని బ్రోచర్ అందించి ఆహ్వానం పలికారు. ఉమ్మడి అనంతపురం జిల్లాకు చెందిన వివిధ రంగాల్లో నిష్ణాతులైన 23 మంది ప్రముఖులకు ఈ పురస్కారాలను అందిస్తున్నట్లు ఆయన కలెక్టర్‌కు వివరించారు.

ఆర్‌ఎంపీలు ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలి

చిలమత్తూరు: ఆర్‌ఎంపీలు కేవలం ప్రాథమిక చికిత్స మాత్రమే చేయాలని వైద్యాధికారి డా. రామకృష్ణ పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండలంలోని వైద్యాధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్‌ఎంపీలు అత్యవసరమైన సమయాల్లో ప్రాథమిక చికిత్స చేసి 108కు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ రామ్‌కుమార్, డీటీ హనుమంతు, ఎస్‌ఐ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రీకృష్ణదేవరాయల జయంతి

మడకశిర: పట్టణంలోని తేరువీధిలో మంగళవారం శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలను బలిజ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బలిజ సంఘం నాయకులు కేక్ కట్ చేశారు. మాతృభాష గొప్ప తనాన్ని ప్రపంచానికే చాటిచెప్పిన ఘనత శ్రీకృష్ణదేవరాయలుదేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు తిమ్మరాజు, శ్రీనివాసులు, రమేష్ , రవి, లక్ష్మీపతి, సూరి, వెంకటేశ్, నారాయణ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సిద్ధరామేశ్వర స్వామి జయంతి

పావగడ: బోవి (వడ్డెర) సామాజిక వర్గం ఆరాధ్య దైవమైన ఇమ్మడి సిద్ధరామేశ్వరస్వామి 850వ జయంతి వేడుకలను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఆర్‌ఐ రాజగోపాల్, రవి, రాజేశ్ తదితరులు స్వామి చిత్రపటానికి పూజలు చేశారు. బోవి సంఘం అధ్యక్షుడు బంగారప్ప మాట్లాడుతూ బాగలకోటె, చిత్రదుర్గంలో సిద్ధరామేశ్వర స్వామి దేవాలయాలు, మఠాలు ఉన్నాయన్నారు. వేడుకల్లో జి వెంకటేశ్, రామాంజనేయ, సుజిత్, హనుమంతరాయప్ప, బొట్టు వెంకటేశ్, చెన్నకేశవ తదితరులు పాల్గొన్నారు.

సంజీవరెడ్డిపై బహిష్కరణ వేటు



కర్రా సంజీవరెడ్డి

పెనుకొండ: నియోజకవర్గంలోని గొల్లపల్లికి చెందిన కర్రా సంజీవరెడ్డిని వైఎస్సార్‌సీపీ నుంచి బహిష్కరించినట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎమ్మెల్యే మాలగుండ్ల శంకరనారాయణ తెలిపారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతుండటంతో వైఎస్సార్‌సీపీ రాయలసీమ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాలమేరకు సంజీవరెడ్డిని పార్టీ నుంచి బహిష్కరించినట్లు వివరించారు. పార్టీ అభ్యున్నతికి పాటుపడే ప్రతి ఒక్కరికీ భవిష్యత్తులో మంచి స్థానం ఉంటుందని ఎమ్మెల్యే స్పష్టం చేశారు.

రాష్ట్ర కోఆర్డినేటర్‌గా ఆంజనేయులు

చిలమత్తూరు: సమాచార హక్కు కార్యకర్తల సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్‌గా మండలంలోని కమ్మయ్యగారిపల్లికి చెందిన ఆంజనేయులు ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు ముత్తు నియామక పత్రం అందజేసినట్లు ఆంజనేయులు తెలిపారు. రాష్ట్రంలో సమాచార హక్కు చట్టంపై ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో కృషి చేస్తామని ఆంజనేయులు పేర్కొన్నారు.

ఉత్సవాల నిర్వహణపై నేడు సమావేశం

లేపాక్షి: లేపాక్షి వీరభద్రస్వామి దేవాలయంలో మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని బుధవారం ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్య నిర్వహణ అధికారి నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో మహాశివరాత్రి ఉత్సవాలు సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్ల గురించి చర్చిస్తామన్నారు. సర్పంచ్ ఆదినారాయణతో పాటు గ్రామ పెద్దలు ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, జేఏసీ కమిటీ సభ్యులు హాజరుకావాలని కోరారు.

నేడు కౌన్సిలర్లు, నాయకులతో సమావేశం

హిందూపురం: హిందూపురం మున్సిపాల్టీ పరిధిలోని వైఎస్సార్‌సీపీ వార్డు కౌన్సిలర్లు, వార్డు ముఖ్యనాయకులతో బుధవారం మధ్యాహ్నం 1.30 గంటలకు స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ పార్టీ పరిశీలకుడు రెడ్డిశ్వర్‌రెడ్డి తెలిపారు. 1 నుంచి 10 వార్డులకు సంబంధించి ఒక్కొక్క వార్డు కౌన్సిలర్/ వార్డు ఇన్‌చార్జి, ఆ వార్డు ముఖ్యనాయకులతో వార్డు వారీగా చర్చించనున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్, ఎంపీ గోరంట్ల మాధవ్ తదితరులు సమావేశానికి హాజరు అవుతారన్నారు.